

హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, కుడా చైర్మన్ సుందర్‌రాజ్



మహబూబాబాద్‌లో కురుస్తున్న వర్షం



వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పటేల్‌గూడెం కల్వర్ట్ వద్ద నిలిచిన రాకపోకలు



గూడూరు : భూపతిపేటలోని లోతట్టు ప్రాంతంలోని ఇండ్లలోకి చేరిన వరద నీటిని కాల్వలోకి తరలిస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్



లింగాలఘనపురం మండలం పటేల్‌గూడెం కల్వర్టు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న జనగామ కలెక్టర్ శివలింగయ్య

# అనుక్షణం అప్రమత్తం

## భారీ వర్షాల నేపథ్యంలో అధికార, పాలకవర్గాలు అలర్ట్

- ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్లు, ఎమ్మెల్యేలు
- ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై సూచనలు
- హనుమకొండలో చీఫ్ విప్ దాస్యం, కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలన
- పటేల్‌గూడెంలో కల్వర్టు వద్ద భద్రతపై ఆరా తీసిన కలెక్టర్ శివలింగయ్య
- బయ్యారంలో పర్యటించిన కలెక్టర్ శశాంక
- మంగపేటలో మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి దిశానిర్దేశం

వర్షాల నేపథ్యంలో అధికార, పాలకవర్గాలు అప్రమత్తమయ్యాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, వాగులు, ఇతర జల వనరులు నిండడంతో పాటు లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లోకి ఇంకా వరద అలాగే ఉంది. రెండు రోజుల నుంచి వర్షం కాస్త తెరిపినిచ్చినా వరద తీవ్రత అలాగే ఉండడంతో పలుచోట్ల ఇంకా పరిస్థితి అదుపులోకి రాలేదు. అలాగే వర్షాకాలం వ్యాపించే సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం తేలికపాటి జల్లులు కురిసినప్పటికీ వరద తీవ్రత అలాగే ఉండడంతో అధికార, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఇందులో భాగంగా హనుమకొండ బస్‌స్టేషన్ పరిసరాల్లోకి వరద నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండడంతో కలెక్టర్ సిక్తాపట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలతతో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే యూత్ హాస్టల్, ఆర్డీవో ఆఫీస్, ఎమ్మార్వో కార్యాలయాల్లోనూ కలియదిరిగి వెంటనే పరిష్కరించాలని అధికారులకు చెప్పారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న కార్యాలయాన్ని మరోచోటికి మార్చడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షించాలని దాస్యం ఆదేశించారు. అలాగే లింగాలఘనపురం మండలం పటేల్‌గూడెం లో లెవల్ కల్వర్టు వద్ద వరద నీరు పారుతుండడంతో జనగామ-పాలకుర్తి మధ్య రాకపోకలు నిలిచిపోగా కలెక్టర్ శివలింగయ్య పరిశీలించారు. నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉన్నందున భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక దారి మళ్లించడంతో పాటు ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డుగా సిబ్బందిని కాపాలా పెట్టారు. అలాగే మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి, కొత్తపేట గ్రామాల్లో కలెక్టర్ శశాంక క్షేత్రస్థాయిలో పర్యటించారు. వీధుల్లో వెంట కలియదిరుగుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటి సమీపంలో మురుగు నీరు, చెత్త వంటివి ఉండకుండా చూసుకోవాలని తద్వారా వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి వరద తీవ్రత రోజురోజుకూ మారుతున్నది. కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో పాటు ఏటూరునాగారం, మంగపేట వద్ద ఉధృతి పెరుగుతున్నది. ఈక్రమంలో పరిస్థితిని బట్టి ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. శనివారం మంగపేటలో పర్యటించిన మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి వరదలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. వరదలు తీవ్రమైనప్పుడు వెంటనే ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు పోలీస్, రెస్క్యూ టీములను రంగంలోకి దింపాలని ఆదేశించారు. ఇలా అధికార, పాలక యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అండగా నిలుస్తున్నది.

- నమస్తే నెట్‌వర్క్, జూలై 22

# వాగులు దాటి.. వైద్యం చేసి..

వెంకటాపురం (నూగూరు) జూలై 22 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించి కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంత గ్రామాల్లో అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. దీంతో వైద్యులు, సిబ్బంది వాగులు, వంకలు దాటి వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందించడంతోపాటు సర్వేలు చేస్తున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలోని పెంకవాగు, కొత్తగుంపు, కానిపాకం, తిప్పాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఫీవర్ సర్వే చేపట్టారు. వైద్య సిబ్బంది వాగులు దాటి ఆయా గ్రామాలకు వెళ్లి ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. సుమారు 645 మందిని కలిసి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కొందరి నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఎదిర డాక్టర్ భవ్యశ్రీ, వైద్యసిబ్బంది రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం (నూగూరు) మండలంలో ఫీవర్ సర్వే

వాగులు దాటుతున్న డాక్టర్, వైద్య సిబ్బంది



ఫీవర్ సర్వే చేస్తున్న సిబ్బంది



నర్సంపేట రూరల్: మత్తడి మడుతున్న గురిజాల పెద్ద చెరువు



బయ్యారం : గంధంపల్లి కొత్తపేటలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

## చిట్టిముత్యాలే.. ధారలై



ములుగు జిల్లా వాజేడు మండలం బొల్లారం అటవీ ప్రాంతంలో చిట్టిముత్యాల జలపాతం తెల్లని ముత్యాలు దొర్లినట్లుగా జాలువారుతూ కనువిందు చేస్తున్నది. పర్యాటకులు జలపాతం వద్ద ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

- వాజేడు, జూలై 22

## ఏడుబావుల.. జాలువారంగ



మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలో పాండవుల గుట్టకు అనుసంధానంగా ఉన్న మిర్యాలపెంట సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏడుబావుల జలపాతం కనువిందు చేస్తున్నది. గుట్టలపై నుంచి జాలువారుతూ పర్యాటలకును ఆకర్షిస్తున్నది.

- గంగారం, జూలై 22

## బొగత.. పర్యాటకుల పులకింత



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో తెలంగాణ నయాగరా బొగత జలపాతం పాల నురగలా పరవళ్లు తొక్కుతూ జాలువారుతున్నది. పర్యాటకులకు కనువిందు చేస్తున్నది.

- వాజేడు, జూలై 22

## గుండం.. అద్భుతం



ములుగు జిల్లా వాజేడు మండలం అరుణాచలపురం అటవీ ప్రాంతంలో గుండం జలపాతం రెండు గుట్టల మధ్య నుంచి సన్నని ధారాల జాలువారుతూ ఆకట్టుకుంటున్నది. సెలవు రోజు కావడంతో పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు.

- వాజేడు, జూలై 22